కథానిక

# భ్రమలుపోయిన నిర్మల

"విశ్వామిత్ర"

ఈ విషయం చెప్పగానే చదువుతూవున్న పుస్తకాన్ని, తనకి తెలీకుండానే జారవిడిచి నోరంతా తెరుచుకుని కోటి నా మొఖం వంక అదోవిధంగా చూట్టం మొదలు పెట్టేడు. తనే కాదు, నా సంగతి తెలిసిన ఎవడైనా ఆ విషయం వింటే నోరు తెరవక మానడు. ఎవరిదాకానో ఎందుకు, నాకు నేనే ఆశ్చర్యపోయాను, "ఏమిటీ, నాలో యింత శక్తి వుందా?" అని.

ఇన్నాళ్ళనుంచీ మా కోటీశ్వర్రావుకి ఈ విషయం చెప్పకపోవటానికి కారణం ఇదో పెద్ద హాస్యమని కాదు. ఇదో పెద్ద విశేషంగా నాకు తోచలేదు. ఓ నాడెందుకో మాటల సందర్భంలో నేనే అన్నా,

"ప్రేమలో ఎంత మాధుర్యముందో అంత కాఠిన్యమూ వుంద"ని.

ఇంతకు పూర్వం వాడితో నేనెప్పుడూ "ప్రేమ"ని గురించి మాట్లాడివుండక పోవటం మూలాన నా ఆ ధోరణి వాడికి కొంత వింతగా తోచటంలో ఆశ్చర్యం లేదు.

నా చేత నిజాన్ని బైట పెట్టించాలనో లేకపోతే మామూలుగానే అన్నాడో గాని మొత్తానికి వాడు నేనా మాటనంగానే నా వంక అనుమానంగా చూసి,

"అఁ—! అదంతా అనుభవం మీదగానీ తెలీదులేరా." అన్నాడు.

"ప్రతివాడూ అనుభవించకపోయినా అనుభవించినవాడిని చూసి తెలుసుకోవచ్చుగా."

"అదికాదు, బాదపడేవాడిని చూసి వాడనుభవించే బాధని మనం పూర్తిగా అర్థం చేసుకోనటం కష్టం. బాధపడేవాడిని చూస్తే సానుభూతి చూపాలని వుంటుంది గాని, వాడి బాధల్ని అర్థం చేసుకోవటం అంత తేలిక పని కాదు" అన్నాడు కోటి. ఇప్పటికైనా నేను "అనుభవించే చెప్తున్నాన"ని అంటాననే నమ్మకంతో.

నేను మాట్లాడలేదు.

వాడే అన్నాడు మళ్ళీ, "ప్రేమించటమంత బుద్ధితక్కువ ఇంకోటి లేదు."

వెంటనే నేనన్నాను—"అదైనా అనుభవం మీదగాని చెప్పలేమేమో?"

"కావొచ్చు - కాని అలా అని నా నమ్మకం." దెబ్బ తిని కొంచెం మెల్లిగా అన్నాడు.

వాడు తగ్గటం చూసి నేను కొంచెం గట్టిగా అన్నాను,

"ప్రేమించటం తప్పు కాదు, ఫలితాలకి తట్టుకోగలిగితే. నిజంగా ప్రేమలో కాఠిన్యమే లేకపోతే దానికంత విలువ వుండేదే కాదేమో!"

నా ధోరణి చూసి వాడు నావైపు అడుసులో కాలేసినవాణ్ణి చూసినట్టు చూశాడు.

ఆ అడుసుని కడుక్కోటానికే నేమో నా ఈ ప్రయత్నం అని వాడి అనుమానాన్ని గ్రహించి, వాడేమంటాడో అని వాడివంక ఆదుర్దాగా చూశాను.

"ఐనా ప్రేమలో మృదుత్వముందో, కఠినత్వమే వుందో నేనెప్పుడూ ముట్టుకు చూళ్ళేదులే" అన్నాడు.

"ఐనప్పుడు నేను చెప్పింది వినరాదూ?" అన్నాను విజయగర్వంతో...

వాడూ నాచేత ఏదో బైట పెట్టించగలిగానన్నట్టు, నావంక కొంటిగా చూసి అన్నాడు,

"నా ఉద్దేశంలో ప్రేమించాననుకోవటం వొట్టిభ్రమ. ఒక వ్యక్తిమీద ఇంకో వ్యక్తికి వుండేది నువ్వనుకునే ప్రేమ కాదు నా వుద్దేశంలో... వాంఛ—! ఒకే సెక్సుకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులమధ్య కంటే రెండు సెక్సులకి సంబంధించిన ఇద్దరు వ్యక్తులమధ్య ఈ

"ప్రేమ" అనేది పెరగటానికి కారణం కోరికే!"

"కోరిక!–నిజమే!" అని నాలో ఏదో అనిపించింది.

కోటి ఈ మాటలు చెప్పినతర్వాత నిర్మల విషయం ఓసారి సింహావలోకనం చేసుకోగా, నిర్మల చేసే ప్రతిపన్లోనూ కోరిక గోచరించింది– స్వార్థం! ప్రేమలోవున్న కారిణ్యానికి కారణం కూడా ఇదే.

*　　*　　*

'రాత్రి ఎనిమిదింటికి వస్తాను." అని చెప్పి నా రూముకి వచ్చేశాను.

"సరే"నని ఒప్పుకోవటమే కాక తప్పకుండా రావాలనికూడా చెప్పింది. వెళ్ళాను, సరిగ్గా ఎనిమిదింటికే. రూం తాళం వేసుంది.

నిర్మలని ప్రేమించానని నిర్మలకి తెలుసు. అందుకనే నన్ను ఇలా ఏడిపించటం. లేకపోతే తప్పకుండా వస్తానని చెప్పినా అదే టైంకి గది తాళంవేసి ఎక్కడికో పారిపోవటమేమిటి?

నన్ను ఎంత చులకనగా చూస్తూందో నా కర్థమయింది.

మర్నాడడిగాను. స్నేహితురాళ్లు బలవంతంచేస్తే సినిమాకి వెళ్లవలసి వచ్చినందుకు క్షమించమంది.

తనకి అవసరం వున్నప్పుడల్లా నా గదికి వొచ్చేది. కాని "నేను నీగదికి వొస్తాను" అని చెప్పినా వుండకపోవడం నన్ను యెంత నిర్లక్ష్యంగా చూస్తోందో తెలియచేసింది.

నిజంగా కోటి చెప్పింది అక్షరాలా నిజం. వాడు చెప్పినదాంట్లో ఏది నిజంకాదు? వాడు చెప్పింది నిజమని నమ్మటానికి నాకు ఎదురుగా కోటే కనిపించాడు. ఎందుకంటే నాలుగో తరగతి నుంచి వాడూ నేను కలిసి చదువుకొంటున్నాం. వాడు నాకెంతో సన్నిహితుడు. కాని ఈ రెండేళ్ళనుంచీ "నిర్మల" నాకు అందరికంటే సన్నిహితురాలుగా కనిపించటానికి కారణం వాడు చెప్పిందే.

*　　*　　*

కానీ ఈ విషయాన్ని కోటి యివ్వాళ విప్పి చెప్పిందాకా నేను అది గ్రహించలేకపోవటం నాకు కోటిలో ఏదో గొప్పతనాన్ని చూపింది!

"మానవుడి నైతిక పతనానికి ఆఖరి మెట్టు అందరూ వూహించుకునే ఈ ప్రేమే!" జుగుప్సతో అన్నాడు కోటి.

నాలో మార్పుని గ్రహించకుండా కోటి ఇంకా నన్ను వాడివైపు తప్పుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

ప్రేమించడం అందరూ చేయగలిగిన పనైనప్పుడు ప్రేమించటంలో గొప్పతనమేముంది? నిర్మలని ప్రేమించిన కొత్తలో నా కొక్కడికే చేతవును ఇలా ప్రేమించటం అనుకొనేవాణ్ణి. ఎవ్వరూ ప్రేమించలేనంత గొప్పగా ప్రేమించాననుకొనేవాణ్ణి, కోటి "బురదలో కాలేశావు కడుక్కో"మని చెప్పేదాకా. కోటి చెప్పిన పాఠం నేను ఈ జన్మలో మరిచిపోను.

నిర్మలని ప్రేమించటం మానెయ్యటానికి చాలా శ్రమ పడాల్సొచ్చింది. అన్నిటికంటే నిర్మల నా దగ్గరకొచ్చి, "ఎందుకు మాట్లాడవ్? అనీ, ఎందుకు నా రూమ్‌కి రావటం మానేశావు? అనీ, నాతో ఇహ మాట్లాడవా?" అనీ జాలిగా అడుగుతుంటే ఏమని చెప్పాలో తోచక కళ్ళనీళ్ళు కారుస్తుంటే నిర్మల నా మొఖంకేసి దీనంగా చూసి తన పమిట చెంగుతో కన్నీళ్లు తుడిచేది. "నేను ఫలానందుకు నీతో సంబంధాన్ని వొదులుకుంటున్నాను" అని నిర్మలతో చెప్పటానికి సిగ్గేసేది.

నాతో పోల్చి చూసుకొంటే కోటి నాకంటే ఎంత గొప్పవాడో అనిపించేది. కోటి ఎవర్నీ ప్రేమించలేదు. ప్రేమించలేక కాదు. అందగత్తెలు కరువై కాదు. కోటి నిగ్రహశక్తిని నాలోని అపలేనితనం ఋజువు చేసింది.

నిర్మల ఏడ్చేది. కన్నీళ్లు కార్చింది. నా గుండెని తనకి తెలిసిన చాలా రాళ్ళతో పోల్చింది. ఏమైనా నాలో చైతన్యాన్ని చూడలేక బాధ పడేది.

నిర్మలని బాధ పెట్టటం నా ఉద్దేశం కాదు. కానీ నాబాగుకోసం నేనే బాధ పడుతుంటే మధ్య నేనేం చెయ్యకుండానే నిర్మల బాధ పడుతుంటే ఇందులో నా తప్పేముంది?

నిర్మలని వొదిలించుకోవటం ఒక పట్టాన తేలిక పనికాలేదు. కాని నిర్మల వొదిలిన తర్వాత నిర్మలని మరిచిపోవటం కూడా అంత

తేలిక పని కాలేదు. పట్టి బలవంతాన ఆమెని మరిచిపోగలిగాను. అక్కడికీ కోటి తీరికైనపుడల్లా నీతి బోధలు చేస్తూంటే.

ప్రేమించకుండా వుండటంలో కూడా గొప్పతనం లేకపోలేదని, నిర్మలని, మరిచిపోవటానికి నేను పడే బాధలు వివరిస్తున్నై.

గొప్పతనాన్ని సాధించటం అంత తేలికైన పనేం కాదనే సూక్తి కూడా అనుభవంలో బాగా తెలుస్తోంది.

పరీక్షలు దగ్గిరబడ్డయ్. నా పరిస్థితి అర్థం చేసుకొన్న కోటి, వాడు చదువుకొంటూ మధ్య మధ్య దిక్కులు చూస్తున్న నన్ను చదవమని జ్ఞాపకం చేసేవాడు.

ఈ పరీక్షల హడావుడిలో నిర్మల సంగతి చాలా భాగం మరిచిపోయాను. పరీక్షలైపోయిన తర్వాతమాత్రం ఒక్కసారి నిర్మల కనపడి "మా వూరు వెళ్ళిపోతున్నా" నని మాత్ర మంది.

"ఎప్పుడు?" అని నేనడుగుతానని అనుకుంది. కాని "సరే"నన్నట్టు మౌనంగా నేను వూరుకొన్నాను.

అదే ఇంకోసమయంలో ఐతే ఆమె ప్రయాణాన్ని కొన్నిరోజులపాటు ఆపి, ఆఖరికి వెళ్ళేటప్పుడు రైల్లో జాగ్రత్తగా ఎక్కించి, మరీ వొచ్చేవాణ్ణి. అటువంటివాణ్ణి "వెళ్తానంటే" సరేనన్నట్టు మాట్లాడకుండా వూరుకోవటంలో నాలో వొచ్చిన మార్పుని గ్రహించి జాలిగా తలవంచుకొని వెళ్ళిపోయింది నిర్మల.

నాకూ జాలేసింది. కాని కోటి మాటలు...

కొన్ని సంవత్సరాలు గడిచినై. కోటికీ నాకూ చాలా దూరం ఏర్పడింది. ఉత్తరాలు తప్ప మనుషులు కలుసుకొని మాట్లాడుకోవటం అప్పటికే తగ్గింది. కానీ వాడి ప్రతి ఉత్తరంలోనూ వాడి ధోరణి నాకు వ్యక్తం అవుతూనే వుంది. నా కొచ్చేజీతంలో కొంత భాగాన్ని అయ్యారుకియ్యటంవల్ల చేతులు కాల్చుకునే దురవస్థ తప్పింది. మిగతా డబ్బుని కావలసిన ఇతరవస్తువులమీద ఖర్చుపెట్టేవాణ్ణి.

నా జీవితంలో భాగస్వాములు లేకపోవటం నాకో కొరతగా తోచక పోగా ఎంతో స్వేచ్ఛగా వుండేది. అంతకంటే నేనైనా కోరతగిం దేమీలేదు. కోటి దగ్గరనుంచి వుత్తరమొచ్చినప్పుడల్లా జవాబు రాసేవాణ్ణి.

నాకే ఉద్యోగంలోనైనా గొప్పగా రాణిద్దామని వుండేది కాదుగాని, చేసినపనే చేయటమనే విసుగుతో, కొత్త వుద్యోగానికి ప్రయత్నాలు సాగించా. ఈ నా ప్రయత్నం చురుగ్గా చేయటంలో కోటి రాసిన ఒకటి, రెండు వుత్తరాలకి జవాబురాయటం పళ్ళేను. ఏవేవో నాలుగైదు వూళ్ళకి ఇంటర్వ్యూకి వెళ్ళి రావటంలో బద్ధకించను. చివరకి ఇంకో వూళ్ళో ఏదో వుద్యోగంలో చేరాన.

ఇదంతా అయ్యేటప్పటికి ఓ ఇరవై రోజు లయింది. కోటికి వుత్తరం రాశాను. కానీ జవాబు రాలేదు. ఇంకో రెండు మూడు ఉత్తరాలు రాస్తే అవి మళ్ళీ నాదగ్గరకే వచ్చినయ్. ట్రాన్స్‌ఫర్ అయ్యాడని దాన్నిబట్టి అర్థమైంది.

తర్వాత కొన్నాళ్ళకి ఏదో రైల్లో వెళ్తూంటే ఎవరో కోటి విషయం అనుకొంటున్నారు. వాళ్ళని వివరాలడిగితే ఫలానిచోట వుంటున్నాడని చెప్పారు. అప్పటికే నాకూ కోటికీ వుత్తరాలు నడవక ఆర్నెల్లయింది.

వొంటరివాణ్ణే కనక వాళ్ళు చెప్పిన ప్రకారం ఆ వూరెళ్ళాను. అప్పటికే రాత్రి పదిన్నరో పదకొండో అయింది. ఐనా నా మాదిరిగానే వాడూ బ్రహ్మచారే గదా! కనక "డిస్ట్రిబ్" చేసినట్టవదులే, పైగా సంతోషిస్తాడు కూడాను అనుకుంటూ వాడింటి వైపు వెళ్ళాను.

వాడూ నామాదిరిగానే ఓగదిలో దోమలు తోలుకుంటూ కూర్చున్నట్టు ఊహించాను. నా కంటే నా మనసే ముందరవాణ్ణి చేరింది.

వాళ్ళు చెప్పిన గుర్తుప్రకారం వెళ్లాను. అదో పెద్ద బంగళా! ఏమోలే ఎక్కడా విడిగా గది దొరక్క ఇందులో ఏదైనా రూంలో వుంటున్నాడేమో అనుకొన్నా.

"కోటీ" అని పిల్చాను.

లోపల ఏదో గాజుల చప్పుడు వినపడటం వల్ల తప్పు అడ్రసు ప్రకారం వొచ్చానేమో అనుకొన్నా.

విడిగా ఏవైనా గదులు వున్నయేమో అని వెనక్కి తిరిగి అటూ ఇటూ తిరుగుతున్నాను.

ఇంతలోనే తలుపు తీసిన చప్పుడయ్యింది. భుజంమీద వున్న తువాలుతో చెయ్యి తుడుచుకుంటూ,

"ఏరోయ్-! ఎప్పుడు రావడం?" అంటూ కోటి దగ్గిరి కొచ్చాడు.

గాజుల చప్పుడైన ఆ ఇంట్లోంచేనా కోటి వొచ్చింది? ఆశ్చర్యంగా వాడివెనక ఓరగా తెరిచివున్న తలుపువంక చూశాను.

నేను వెనక్కి చూడటం చూసి వాడు కూడా వెనక్కి చూసి చప్పున రెండంగలు వేశాడు.

ఎందుకో అనుకున్నా. పావునిమిషంలో ఓ పసిపిల్లాణ్ణి ఎత్తుకుని వచ్చాడు.

అర్థంగాక ఆ పసిపిల్లాడి వంకా, వాడి వంకా అదేపనిగా చూడటంతో కూర్చోటం కూడా మరిచిపోయిన నన్ను బలవంతాన కూర్చో పెట్టి,

"ఏమిటలా ఆశ్చర్యపోతావ్?" అన్నాడు.

ఆ పసిపిల్లాడి మొఖం ఎక్కడో చూసినట్టు నాకు అనిపించి అడిగాను.

"ఈ పిల్లవాడి మొఖం ఎక్కడో చూసినట్టుంది."

"నీ మొఖంలే. పసిపిల్లలందరూ ఒక మాదిరిగా వుంటారు" అని తోసేశాడు.

వాడి ఒళ్ళో ఆ కుఱ్ఱాడు కేరింతాలు కొడుతూ ఆడుకొంటున్నాడు. పిల్లవాణ్ణి చూస్తుంటే నాకు ఏవో పాత అనుభవాలు గుర్తుకొస్తున్నట్టనిపించింది.

ఇంతలో లోపల్నుంచి కేక వినపడ్డది. ఆ కేక నా మనసులో ఏదో కదలికని కలిగించింది.

నాకు పరిచయం చేయటానికి కోటి భార్యని బైటికి పిలిచాడు,

నేను కూర్చున్న కుర్చీ వెనక భాగం కొంచెం గట్టిదవటం అపింది గాని లేకపోతే ఆమె ప్రవేశం నా నిష్క్రమణకి దారితీసేదే.

నా హంగామాలో నేను చూడలేదుగానీ "ఆమె" కూడా ఎక్కువగానే ఆశ్చర్యపడి వుంటుందని నా నమ్మకం.

దీనికంతకీ కారణం కోటి భార్య "నిర్మల!" అవటమే.

ఐతే ఈ వ్యవహారమంతా అతి త్వరలో జరిగిపోవట్టంతో కోటి మమ్మల్ని గమనించలేదు. కాని కోటికి "నా" నిర్మల విషయం నేను ఇంతకాలంనుంచీ చెప్పలేదని నా కప్పటిదాకా గుర్తుకే రాలేదు.

"ఈమెని నువ్వు ఎరిగేవుంటావు," అన్నాడు కోటి నావంక చూస్తూ.

నేను కాలేజీలో చదివినంతకాలం ఒకర్ని ప్రేమించినట్టు కోటికి తెలుసు కానీ, ఆ ఒకరు ఈవిడే అని తెలియదని వాడి మాటలవల్ల స్పష్టంఅయిన తర్వాత నాకు వాణ్ణీ, నిర్మలనీ చూసి ముచ్చటవేసి, నా అదృష్టానికి తిట్టుకున్నా. నా విషయంమాత్రం బైట పెట్టదలుచుకోలేదు. ఈవిషయంలో "నిర్మల" కూడా నాతో ఏకీభవించి, తను నన్ను మామూలుగా చూసే వుంటానన్నట్టు మాట్లాడింది.

కొంతసేపైన తర్వాత "కోటి" వాడి మామూలు "ధోరణి" సాగించాడు. చేతైనంత ఎక్కువగా ఆశ్చర్యపడి నేను "ఏమిట్రా-మరి పెళ్ళి?" అన్నా.

"వుందిలే అంతా." అన్నాడు.

"లేకండా ఎలా వుంటుందిగానీ, ఏమిటది?"

"నేను ప్రేమించలేదు. ప్రేమించబడలేదు! ఐతే పెళ్ళి చేసుకోవటానికి కారణం "నిర్మల" వుద్దేశాలన్నీ నాతో ఏకీభవించటమే. నిర్మల చెప్పింది:-'సోహినీ-మహీవల్; షిరీన్-ఫర్హాద్; లైలా-మైన్; వీళ్ళ కథలన్నీ కల్పితాలనీ అసలు ప్రపంచంలో ప్రేమ అనేది లేదనీ...' నేను అడిగాను— 'మరి నన్ను పెళ్లి చేసుకోమని అడుగుతున్నా వెందుక'ని. అందుకు చెప్పింది- 'యువతిగా పుట్టి - ప్రకృతి సహజమైన తల్లి రూపాన్ని తను పొందాలనీ, అందుకు సంఘపు కట్టుబాట్లను అనుసరించి వివాహం చేసుకోవాలనీ..."

ఇట్లా ఏమిటో చెప్పేస్తున్నాడు వాడు. మధ్యలో నిర్మల అక్కడికొచ్చి తువ్వాలు, సబ్బూ ఇచ్చి వెళ్ళింది.

అవి నా కందిస్తూ "లే!" అన్నాడు.

నేను మాట్లాడలేక, ఏం మాట్లాడాలో తెలియక వాడిచ్చిన తువ్వాలు భుజాన వేసుకొని, స్నానాల గదివైపు వాడు చూపించిన దోవన నడిచాను.